క్లుప్తంగా

మాక్ పోలింగ్



ఏటూరునాగారం : ఓటు హక్కును వినియోగించుకోవాలని రామన్నగూడెం జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కొయ్యడ మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం పాఠశాలలో శాసనసభ ఎలక్షన్ మాక్ పోలింగ్‌ను సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలు పర్వతాల రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఈ మాక్ పోలింగ్‌లో పాల్గొని ఓటు వేసే విధానం, దానికి ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. మాక్ పోలింగ్‌తో పాఠశాలలోని విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించామని మల్లయ్య, రమాదేవి తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక



గోవిందరావుపేట : సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు రాఘవపట్నం సర్పంచ్ దబ్బకట్ల లలిత-రవీందర్ అన్నారు. ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తామని తెలిపారు. నాగజ్యోతికి రాఘవపట్నం నుంచి భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషి చేస్తామని వారు అన్నారు. వీరిని ములుగు ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, సూరపనేని సాయికుమార్, మధుసూదన్ రెడ్డి, నాగేశ్వరరావు, ఫక్రుద్దీన్, నగేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

'తొలిమెట్టు'ను సమర్థవంతంగా నిర్వహించాలి



మంగపేట : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు భాష, గణితంలో కనీస సామర్థ్యాల, అభ్యసన ఫలితాల సాధనకు తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలో నిర్వహిస్తున్న పాఠశాలల సముదాయ సమావేశాలకు ఆయన బుధవారం హాజరై ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం కమలాపురం, మంగపేట, తిమ్మంపేట, రాజుపేట ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాల ఆధారితంగా బోధనా ప్రణాళికలు తయారు చేసుకుని బోధన సోపానాల ప్రకారం తరగతి గదిలో అభ్యసన ప్రక్రియ చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల విద్యార్థుల అభ్యసన ఫలితాల సాధనకు రూపొందించిన ఉన్నతి కార్యక్రమం నిబంధనలను తప్పకుండా నిర్వహించాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులకు డిసెంబర్ చివరివరకు ఒక పూట ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సముదాయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన ఎండి ఖలీల్, బదిలీపై వచ్చిన కె.సోమరెడ్డిని ఎంఈఓ దివాకర్‌తో పాటు తదితరులు శాలువాలతో సన్మానించారు.

బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి



వెంకటాపురం(ఎం): బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



వెంకటాపురం(ఎం) : వెల్తుర్లపల్లిలో కూలీల వద్దకు వెళ్తున్న నాగజ్యోతి

● ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

వెంకటాపురం(ఎం) : ములుగు అభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అత్యధిక ఓట్లతో గెలిపించాలని ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. గొత్తికోయ కుటుంబాలకు సహాయం చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకొని వివిధ దేశాల్లో ఉంటున్న ఎన్ఆర్ఐల నుంచి కోట్ల రూపాయలను ఎమ్మెల్యే సీతక్క దోచుకుందన్ని బడే నాగజ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని రామాంజాపూర్, గుంటూరుపల్లి, నారాయణగిరిపల్లె, వెల్తుర్లపల్లి, గుర్రంపేట, పెద్దాపూర్ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతికి ఆయా గ్రామాల్లో ప్రజలు, మహిళలు కోలాటాలతో నృత్యం చేస్తూ బతుకమ్మలతో స్వాగతం పలికారు. అనంతరం నాగజ్యోతి మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో వేల కోట్ల కాంట్రాక్టులతో సంపాదించిన అక్రమసొమ్ముతో ములుగు జిల్లా ఓటర్లను మభ్యపెడుతోందని ఆరోపించారు. వెల్తుర్లపల్లి గ్రామ పరిధి పత్తిచేనులో ఉన్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని నాగజ్యోతి వారిని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గై రుద్రమదేవి ఆశోక్, ఎంపీపీ బుర్ర రజితసమ్మయ్య, బీఆర్ఎస్ మూడు మండలాల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు, మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, నాయకులు మల్క రమేష్, పోరిక హర్జినాయక్, ఎండి.అల్లిమియా, జగన్‌మోహన్ రావు, కొంతం రాజయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీతక్క బెదిరిస్తుంది: రెడ్కో చైర్మన్

ములుగు : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి సీతక్క తనను బెదిరిస్తుందని రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతితో కలిసి ములుగు మండలం దేవగిరిపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ప్రాణాలు అడ్డుపెట్టయినా నాగజ్యోతిని గెలిపించుకుంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తీరును ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

నా జీవితం ప్రజాసేవకే అంకితం



ఎస్ఎస్ తాడ్వాయి: ప్రచారం చేస్తున్న సీతక్క



మంగపేట: కమలాపురంలో..

● ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క

ఎస్ఎస్ తాడ్వాయి : మరోసారి ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని.. నా జీవితం ప్రజాసేవకే అంకితం చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో సీతక్క మాట్లాడుతూ ములుగు ప్రాంత ప్రజలనే నమ్ముకున్నానని ఎమ్మెల్యేగా గెలిపిస్తే చివరి శ్వాస వరకు రుణపడి ఉంటానన్నారు. తనను ఓడించేందుకు కేసీఆర్ రూ.200కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీగా గెలిచి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనా బీఆర్ఎస్ అభ్యర్థి ఐదేళ్ల పదవి కాలంలో గ్రామాల్లో తిరిగిన దాఖలు లేవని ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. మండలంలోని రంగాపూర్, వీరపూర్, బీరెల్లి, ఆశన్నగూడ ఎల్లాపూర్, అంకపల్లి, నర్సాపూర్, కాటాపూర్, పంబపూర్, దామెరవాయి, గంగారం గ్రామాల్లో సీతక్క ప్రచారం నిర్వహించారు. ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, నాయకులు పాల్గొన్నారు.

సీతక్క గెలుపు కోరుతూ ప్రత్యేక పూజలు

గంగారం : మండలంలోని కోమట్లగూడెం కోదండ రామాలయంలో ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధనసరి అనసూయ (సీతక్క)గెలుపు కోరుతూ ఆమె కోడలు కుంజ కుసుమాంజలి సూర్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీతక్కను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

మంగపేట : ప్రజాసేవకు అంకితమైన సీతక్కను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. మండలంలోని కమలాపురంలో సోమయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీల అభ్యర్థులకు సీతక్కపై మాట్లాడే స్థాయి ఉందా అని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు అమూల్యం



కాటారం: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది



మహాముత్తారం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాటారం : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో అమూల్యమైనదని అర్హులైన ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బందికి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ మానవహారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఓటరు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఓటు ఎంతో పవిత్రమైందని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు తమ ఓటును వినియోగించాలని తెలిపారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఏపీఓ వెంకన్న, విద్యానాథ్, హెచ్ఎం షకీల్ హైమద్, పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, టీపీ మనోజ్, సిబ్బంది రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

మహాముత్తారం : మండలంలోని డొబ్బల్‌పాడ్ పాఠశాలలో ఓటుహక్కు వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, ఏపీఎం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్ : మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై బుధవారం ఎంపీడీఓ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, తహసీల్ సిబ్బంది, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు. తహసీల్దార్ లక్ష్మీరాజయ్య మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



చిట్యాల: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మొగుళ్లపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

చిట్యాల : ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల కేంద్రంలో మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామయ్య మాట్లాడుతూ.. ఈనెల 30న జరిగే శాసనసభ ఎన్నికలలో అర్హత కలి గిన ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం మంజుల, ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, బీఎల్ఓలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో బుధవారం ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణవేణి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్సై శ్రీధర్, సూపరింటెండెంట్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే వారసత్వ ఉద్యోగాలు



గణపురం : బుద్దారంలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న గండ్ర జ్యోతి



రేగొండ (కొత్తపల్లిగోరి): మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్ : ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరించినట్లు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఏరియాలోని కేటీకే-1వ గనిలో ప్రచారం నిర్వహించి సింగరేణి కార్మికులతో మాట్లాడారు. సింగరేణి కార్మికుల భవిష్యత్ బాగుండాలన్న, భూపాలపల్లి పట్టణం మరింత అభివృద్ధి చెందాలన్న, రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు సక్రమంగా కొనసాగాలన్న, తెలంగాణ రైతాంగానికి మేలు జరగాలన్న మరో సారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. 10 ఏళ్ల నుంచి ఎంతో మార్పులు చూశామని మరింత మార్పు చూడాల్సిన అవసరం కూడా ఉందన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలనుకున్నప్పటికి కోర్టు కేసుల కారణంగా ఆగిన మెడికల్ ఇన్‌వాలిడేషన్ పేరుతో 12 వేల మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. కార్మిక కాలనీ ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరుచేసినట్లు, సింగరేణి కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు యాజమాన్యం, ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రేగొండ (కొత్తపల్లిగోరి) : ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు చేరవేసి భూపాలపల్లిలో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లి గోరి మండలంలోని గాంధీనగర్, కొనరావుపేట, వేంకటేశ్వర్లపల్లి, సుల్తాన్‌పూర్, నిజాంపల్లి, కొత్తపల్లి గోరి, జగ్గయ్యపేట గ్రామాల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి ప్రజా ఆశీర్వాద యాత్ర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు కేసీఆర్ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని అన్నారు. వారంటీ లేని గ్యారంటీలతో వస్తున్న పార్టీలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని వద్దని కేవలం మూడు గంటలు చాలు అంటున్న కాంగ్రెస్ పార్టీ కావాలా అని ఆలోచించాలని కోరారు. జెడ్పీటీసీ సాయిని విజయ, మండల అధ్యక్షుడు మటిక సంతోష్, సాంబారి సాయికుమార్, శ్రీనివాస్, సర్పంచ్‌లు సూదనబోయిన రజిత, సంతోష్, శ్వేతరాజు, రజితరాజు, అంబాల చందు, సంతోష్ నాయకులు అమ్ముల రాజయ్య, నీలాంబరం,బండి కిరణ్, తిరుపతి, రావన్ నాయక్, రామరావు, విష్ణు, సుమన్, శంకర్, రాజు, సుదర్శన్, సదానందం,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్ : కార్మికులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అభివృద్ధి ప్రదాత రమణా రెడ్డిని గెలిపించాలి
జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి

గణపురం : భూపాలపల్లి అభివృద్ధి ప్రదాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణా రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని భూపాలపల్లిని మరింత అభివృద్ధి చేసుకోవాలని వరంగల్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి పిలుపు నిచ్చారు.బుధవారం మండలంలోని బుర్రకాయలగూడెం,బుద్దారంలో ఆమె బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరమణా రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు ఆయన స్వార్థం కోసం అనేక పార్టీలు మారుతూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో నాయకులు గండ్ర గౌతమ్ రెడ్డి, మోతె కర్ణాకర్ రెడ్డి, పాలసాని లక్ష్మీనరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సాగర్

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

మొగుళ్లపల్లి : మండలంలోని ముల్కలపల్లిలో బుధవారం సర్పంచ్ చదువు అన్నారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన వెంకటరమణారెడ్డిని ఓటు వేసి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, జెడ్పీటీసీ జోరుక సదయ్య, అన్నారెడ్డి, సంపెల్లి నర్సింగరావు, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోడూరి రమేష్, వైస్ ఎంపీపీ రాజేశ్వర్‌రావు, రవి, నర్సింహరెడ్డి, పాల్గొన్నారు

చిట్యాలలో..

చిట్యాల : మండలంలోని శాంతినగర్‌లో జెడ్పీటీసీ గొర్రె సాగర్ ఆధ్వర్యంలో భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బుధవారం గడపగడపకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట: మండలంలోని నేరేడుపల్లిలో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గండ్ర వెంకటరమణా రెడ్డి గెలిపించారని కోరారు. నాయకులు సమ్మిరెడ్డి, రమేష్, జనగాని మంజులసత్యం, మంద రాజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రానున్నది బీజేపీ సర్కారే..



భూపాలపల్లి రూరల్: ప్రచారం చేస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి, పార్టీ నాయకులు



హనుమాన్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

● ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డితో పాటు, జిల్లా నాయకులు, పట్టణ నాయకులు వేర్వేరుగా కీర్తిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కీర్తిరెడ్డి భూపాలపల్లి పట్టణంలోని హనుమాన్ కాలనీ, సీఆర్‌నగర్, పుల్లూరు రామయ్యపల్లి, కుందూరుపల్లి, గండ్రపల్లి, పిల్లోనిపల్లి, బీసీ కాలనీ, మంజూర్‌నగర్ కాలనీలతో పాటు భూపాలపల్లి మండలంలోని రాంపూర్, దీక్షకుంట, గొల్ల బుద్దారం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో కీర్తిరెడ్డి మాట్లాడారు. నియోజక వర్గ ప్రజలు అధికార పార్టీపై వ్యతిరేకతతో ఉండి అవినీతిలేని ప్రభుత్వం రావాలని మార్పు కోరుతున్నట్లు కనిపిస్తుందన్నారు. ప్రజలు రాష్ట్రంలో, భూపాలపల్లి నియోజకవర్గంలో బీజేపీపై అభిమానం చూపిస్తున్నారన్నారు. భూపాలపల్లిలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. 12 సంవత్సరాలుగా బీజేపీ నియోజకవర్గ ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గెలిచిన అనంతరం భూపాలపల్లిలో మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీలతో పాటు రైల్వే లైన్‌ను తీసుకొస్తానని కీర్తిరెడ్డి హామీ ఇచ్చారు. నాయకులు సామల మధుసూదన్‌రెడ్డి, ఎరుకల గణపతి, అధ్యక్షుడు దొంగల రాజేందర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వెశాల సత్యవతి, తుమ్మటి రామ్‌రెడ్డి, కోరే సుధాకర్, మనోహర్ రెడ్డి, మునేందర్, మండల రఘునాథరెడ్డి, గీసా సంపత్, బోరం రాజయ్య, వెంకటరామిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు .

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మహాముత్తారం : సింగంపల్లిలో మాట్లాడుతున్న సీఐ రంజిత్‌రావు



గణపురం: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గణపురం : శాసనసభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ రాములు అన్నారు. ఎన్నికల నేపథ్యంలో భాగంగా బుధవారం గణపురం మండలకేంద్రంలో స్థానిక ఎస్సై మచ్చ సాంబమూర్తి ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో చిట్యాల సీఐ వేణుచందర్, టేకుమట్ల ఎస్సై సుధాకర్, చిట్యాల ఎస్సై రమేష్, మొగుళ్లపల్లి ఎస్సై శ్రీధర్, సీఆర్పీఎఫ్ ఎస్సై షారుక్‌ఖాన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల : ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపేడు, వెల్లంపల్లి, రాఘవరెడ్డిపేట గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాముత్తారంలోఫ్లాగ్‌మార్చ్

మహాముత్తారం : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ఫ్లాగ్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సింగంపల్లి, కనుకునూర్ గ్రామాల్లో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కాటారం సీఐ రంజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్స్ 1) సంగ పర్శిత్, వయస్సు: 12 సం.రాలు, 2) సంగ అక్షిత్, వయస్సు: 11 సం.లు, వారి తరఫున [illegible] ... ములుగు జిల్లా ... మంగపేట మండలములోని సర్వే నెం. 107/4S, విస్తీర్ణం: 3.00 ఎకరాలు, ... [illegible]

ఇట్లు: సం/- బజారు శ్యాం ప్రసాద్, న్యాయవాది, గ్రా: మం: ములుగు, కోర్టు కాంప్లెక్స్ ఎదురుగా, ములుగు జిల్లా. సెల్: 9493140445, 9533332777